ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

బుధవారం 19 మార్చి 2025

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6:29 (బుధవారం సాయంత్రం)

సహర్ 5:01 (గురువారం ఉదయం)

నేతన్నలకు భరోసా లభించేనా..?



- టెక్స్‌టైల్ జోన్‌పై ఆశలు
- ప్రభుత్వ ఆర్డర్లు పెరుగుతాయనే ఆసక్తి
- ఆక్వాహబ్, పర్యాటకంలో కదలిక వచ్చేనా?
- సాగునీటి ప్రాజెక్ట్‌లకు ఊతం కలిగేనా?
- రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు పెరిగేనా?
- రాజన్న సిరిసిల్ల జిల్లాకు కేటాయింపులపై ఆసక్తి
- నేటి బడ్జెట్‌పై జిల్లా ప్రజల ఆసక్తి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో బుధవారం ఆర్థికమంత్రి భట్టివిక్రమార్క శాసనసభలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో ఏ మేరకు రాజన్నసిరిసిల్ల జిల్లాకు నిధులు కేటాయిస్తుందనే ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించి పెండింగ్‌లో పడిపోయిన ప్రాజెక్టులు, మధ్యలో నిలిచి పోయిన పనులకు మోక్షం కలుగుతుందనే ఆసక్తితో ఉన్నారు. జిల్లాలో ఇప్పటికే వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి అడుగులు పడ్డాయి. స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి గత సంవత్సరం నవంబరులో దేవస్థానం అభివృద్ధి పనులతో పాటు ఇతర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సిరిసిల్ల నేత కార్మికులు, పారిశ్రామికులు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న యారన్‌డిపోను ప్రారంభించారు. ఇప్పటికి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్ట్ 9వ ప్యాకేజీలోని మల్కపేట రిజర్వాయర్ అనుబంధ కాలువల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మిడ్ మానేరు ప్రాజెక్ట్‌కు అను సంధానంగా గత ప్రభుత్వంలో ఏర్పాటుకు సిద్ధం చేసిన అక్వాహబ్ ప్రాజెక్ట్ పెండింగ్‌లోనే ఉండిపోయింది. మిడ్‌మానేరు, అనంతారం ప్రాజెక్ట్‌ల కలయికతో పర్యాటక అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఐలాండ్ అభివృద్ధి పనులు ప్రతి పాదనలకే పరిమితం అయ్యాయి. మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో ఏర్పాటు చేసిన జలవిహారంలో ప్రారంభించిన బోట్ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అనేక పనులు పెండింగ్‌లోనే ఉండిపోగా, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కొంతమేర్కైనా ముందుకు సాగుతుందని భావిస్తున్నారు.

● టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి నిధులపై ఆశలు..

సిరిసిల్ల నేతన్నల దశాబ్దాల కల మెగా పవర్‌లూం క్లస్టర్. కేంద్ర ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు మెగా క్లస్టర్‌లు ఇస్తున్నా సిరిసిల్ల నేతకార్మికులకు మాత్రం నిరాశను మిగిలిస్తూనే ఉంది. ఈ సంవత్సరం కేంద్ర బడ్జెట్‌లో మళ్లీ మెగా పవర్‌లూం క్లస్టర్‌పై నిరాశే మిగిలింది. ప్రతి సంవత్సరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్‌లపై ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా చివరకు నేతన్నలు చిన్నబోయే పరిస్థితి కలుగుతోంది. గతంలో వస్త్ర సంక్షోభ సమయంలో కేంద్ర, రాష్ట్ర మం త్రులు సిరిసిల్లలో పర్యటించి టెక్స్‌టైల్ జోన్, మెగాపవర్‌లూం క్లస్టర్‌గా మార్చి అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. శాశ్వత ఉపాధికి పవర్‌లూం క్లస్టర్ దోహదపడుతుందని భావించారు. కేంద్ర ప్రభుత్వం హామీలకే పరిమితమయ్యింది. తెలంగాణ ప్రభుత్వమైనా వరంగల్ తరహాలో భారీ టెక్స్‌టైల్ పరిశ్రమలకు బడ్జెట్ ఊతమిస్తారని భావించారు. బీఆర్‌ఎస్ ప్రభు త్వం మారిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంవత్సర కాలంగా ఒడిదొడుకులను ఎదుర్కొంది. ప్రభుత్వం దృష్టి సారించడంతో వస్త్రపరిశ్రమపై ఆశలు చిగురించాయి. గత బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం టెక్స్‌టైల్ జోన్‌ను తీసుక వస్తుందని భావించినా ఆరుగ్యారంటీల పథకాలతోనే సరిపెట్టింది. ఈసారి రాష్ట్ర బడ్జెట్‌లో టెక్స్‌టైల్ జోన్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆశాజనకమైన కేటాయిం పులు ఉంటాయని భావిస్తున్నారు. సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాం నుంచి ప్రతిపాదనలు పంపిస్తూనే ఉన్నారు. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేంద్ర జౌళిశాఖ మంత్రి కావూరి సాంబశివరావును సిరిసిల్లకు రప్పించిన ఎమ్మెల్యే కేటీఆర్ అప్పటి ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్‌లు మెగా పవర్ లూం క్లస్టర్ హామీని పొందారు. అప్పటి బడ్జెట్‌లోనే ప్రకటిస్తారని ఆశించారు. కానీ నిరాశే మిగిలింది. 2004లో తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి వద్ద 60ఎకరాల్లో టెక్స్‌టైల్‌పార్కును రూ.7.73 కోట్లతో ఏర్పాటు చేశారు. టెక్స్‌టైల్ పార్కులో ఆధునిక మరమగ్గాలను స్థాపించారు. దేశవిదేశీ మార్కెట్‌లో అమ్ముడుపోయే విలువైన వస్త్రాలను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా పార్కులోకి అనుబంధ పరిశ్రమలు రాకపోవడంతో ఉత్పత్తుల్లో మార్పులు రాలేదు. సిరిసిల్లలో లో టెక్నాలజీ మరమగ్గాలపై ఆధునిక ఉత్పత్తులు చేయలేక తరచూ పరిశ్రమ సంక్షోభాన్ని చవిచూసింది. ఆత్మహత్యలు, సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్లలో మార్పులు తీసుకరావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావించాయి. అప్పటి కేంద్ర ప్రభుత్వం సిరిసిల్ల మెగా పవర్‌లూం క్లస్టర్‌ను ఇస్తామని హామీ..

మిగతా 8లో

ముదురుతున్న ఎండలు..

- జిల్లాలో 40.9 గరిష్ఠ ఉష్ణోగ్రతలు

సిరిసిల్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఎండలు ముదురుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రజలు ఎండ వేడికి ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రత 18.3 డిగ్రీలు నమోదు కాగా గరిష్ఠ ఉష్ణోగ్రత 40.9 డిగ్రీలు నమోదైంది. జిల్లాలో ప్రజలు ఉదయం 11 గంటల వరకే ఇండ్లలోకి చేరుకుంటున్నారు. మళ్లీ సాయంత్రం 5 తర్వాత కానీ బయటకు రావడం లేదు. గరిష్ఠ ఉష్ణోగ్రతల్లో ఇల్లంతకుంటలో 40.9 డిగ్రీలు, కోనరావుపేటలో 40.7, వేములవాడ రూరల్‌లో 40.5, ఎల్లారెడ్డిపేటలో 40.4, చందుర్తి, గంభీరావుపేట, బోయినపల్లిలో 40.3, సిరిసిల్లలో 40.2, డిగ్రీలతో ఎల్లో జోన్‌లో ఉన్నాయి. వీర్నపల్లిలో 39.9, వేములవాడలో 39.6, రుద్రంగిలో 39.5, ముస్తాబాద్‌లో 39.4, తంగళ్లపల్లిలో 39.3 డిగ్రీలుగా నమోదైంది.

పెద్దలింగాపూర్ రైతుల దీక్షపై అసెంబ్లీలో చర్చ..

- సాగునీటి కాలువ నిర్మాణానికి నిధుల మంజూరుకు ఆమోదం



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి అంచనాల కాపీని అందిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో ఎల్‌ఎమ్6 కెనాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి సాగునీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆమోదం తెలిపినట్లు మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. కాలువ పనులు పూర్తిచేయాలని రెండు మండలాల రైతులు 16రోజులుగా దీక్ష చేస్తున్నారు. మంగళవారం శాసన సభలో జరిగిన చర్చలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం వల్లనే కాలువ నిర్మాణం పూర్తికాక రైతులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి ఆటపాటలతోనే కాలం గడిపాడని విమర్శించారు. కాలువ పనులు పూర్తి కావాలంటే రూ.3కోట్లు విడుదల చేయాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ఎస్టిమేషన్ కాపీని అందించారు. దీనితో రూ.3.19 కోట్లు మంజూరు చేయడానికి మంత్రి ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు.

రైతులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారు

మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలోని సాగునీటి కాలువ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని ప్రభుత్వం పేర్కొనడం పట్ల మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కృషితో నిధులు మంజూరు అవుతున్నాయని, రైతులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారని తెలిపారు.

కొనసాగుతున్న రైతుల నిరసన

సాగునీటి కాలువ పనులు పూర్తి చేసి నీటిని అందించాలని రైతులు చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో రైతులు చేపట్టిన రిలే నిరాహారదీక్ష మంగళవారానికి 16వ రోజుకు చేరుకుంది. గన్నారం నర్సయ్య, గాదె మధు, అశోక్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ సందర్శించిన ఎస్పీ



పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మహేష్ బి గీతే

తంగళ్లపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ మహేష్ బి గీతే మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసులు, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. అలాగే పెండింగ్ కేసులపై ఆరా తీసి త్వరగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నమోదైన కేసుల దర్యాప్తు విషయంలో అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని అన్నారు. ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తీర్చాలన్నారు. సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సీఐ మొగిలి, ఎస్ఐ రామ్మోహన్ సిబ్బంది ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం

వేములవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట వ్యతిరేకమని వైద్యాధికారి సంపత్ కుమార్ అన్నారు. వేములవాడ పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లను వైద్య ఆరోగ్య శాఖ అధికారుల బృందం మంగళవారం తనిఖీచేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో వేములవాడ పట్టణంలోని పలు ప్రైవేట్ స్కానింగ్‌సెంటర్లను తనిఖీ చేశామని తెలిపారు. ఇందులో భాగంగా గర్భస్థపిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరం అని సూచించినట్లు తెలిపారు. తహసీల్దార్ సుజాత, జిల్లా మహిళా సాధికారత సంస్థ కోఆర్డినేటర్ రోజా, హెచ్‌ఈ బాలయ్య, డిఈఓ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా - కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఆయన తాగునీటి సరఫరా, సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా తాగునీటి సరఫరాలో భాగంగా చేపట్టిన పనులు, ప్రస్తుతం నీటి సరఫరా జరుగుతున్న ఆవాసాలు, వాటర్ సోర్స్, సమస్యాత్మక ప్రాంతాలు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ తదితర అంశాలను సమీక్షించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝు మాట్లాడుతూ జిల్లాలో తక్కువగా తాగునీరు అందుతున్న గ్రామాలు, భూగర్భ జలాలు తగ్గడం వల్ల అధికంగా పైప్ లైన్ నీటి పై ఆధార పడటం వంటి పలు కారణాలవల్ల నీటి ఇబ్బందులు వచ్చే ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించి అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను పకడ్బందీగా చేపట్టాలని, గ్రామాలలో వెంటనే చేపట్టాల్సిన చర్యల ప్రతిపాదనలు సమర్పించాలని అన్నారు. జిల్లాలోని 75 జనావాసాలలో కొన్ని ప్రాంతాలలో తాగు నీటి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉన్నందున అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. వేములవాడ సిరిసిల్ల పట్టణాలలో తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో మిషన్ భగీరథ గ్రిడ్ నుంచి అవసరమైన నీరు రాని పక్షంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఈఈలు జానకి, శేఖర్‌రెడ్డి, డి రాము, ఏఈలు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్లు సమ్మయ్య, అన్వేష్, అధికారులు తదితరులు పాల్గొన్నారు

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు పూర్తి సమాచారం ఇవ్వాలి : కలెక్టర్

వేములవాడ/వేములవాడ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు సమగ్ర సమాచారాన్ని అధికారులకు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. మున్సిపల్ పరిధిలో లే అవుట్ అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్న వెంచర్లను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు అధికారులకు తగిన సమాచారం ఇవ్వాలని అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ డిస్ట్రిక్ట్ చైర్మన్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కమిటీ సభ్యులు వేముల వాడ ఆర్డీవో రాజేశ్వర్, పీఆర్, ఆర్‌అండ్‌బీ ఈఈ లు, నీటి పారుదల శాఖ ఈఈ, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఏడీ ఎస్‌ఎల్‌ఆర్ వెంకట్ రెడ్డి, డీపీవో, డీటీసీపీవో అన్సార్ లేఔట్ స్థానాలను పరిశీలించిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో డీఎల్పీవో నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వాగుల పరిశీలన

వేములవాడ రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి లింగంపల్లి వాగును, మంగళవారం బొల్లారం, హన్మాజీపేట వాగులను అధికారులతో కలిసి తహసీల్దార్ సుజాత పరిశీలించారు. మైనింగ్ ఏడీ క్రాంతికుమార్, పోలీసు అధికారులు ఉన్నారు.

ఘనంగా స్వామివారి పల్లకీ సేవ

- బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ 7



బద్దిపోచమ్మ ఆలయం ఎదుట భక్తుల రద్దీ

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై సంబరాలు

8

నలుగురికి డీఎస్పీలుగా పదోన్నతి

సిరిసిల్ల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో పనిచేసిన నలుగురు డీఎస్పీలకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి లభించింది. జిల్లాలోని వేములవాడ ఎస్ఐగా పనిచేసిన సుందరగిరి శ్రీనివాస్‌రావుకు, సిరిసిల్ల డీఎస్పీలుగా పనిచేసిన ఎన్. ఉదయ్‌రెడ్డికి, పి. వెంకటరమణకు, వేములవాడ డీఎస్పీగా పనిచేసిన ఎస్. చంద్రకాంత్‌లకు అడిషనల్ ఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సైకాలజిస్ట్ పున్నం చందర్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని గణేష్‌నగర్‌లో మరమగ్గాల కార్మికులకు మంగళవారం మైండ్‌కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ ఆధ్వర్యంలో మనోవికాస సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పున్నంచందర్ మాట్లాడుతూ కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోలన్నారు. మరమగ్గాల ప్రారిశ్రామికులు దూస ప్రసాద్, మైండ్‌కేర్ సిబ్బంది వేముల అన్నపూర్ణ, రాపెల్లి లత, కొండ ఉమ, బూర శ్రీమతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు ఏకరువు..

- తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ

- ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాల నివేదిక ఇవ్వాలి

- టీజీఈఆర్‌సీ చైర్మన్ డాక్టర్ జస్టిస్ బి నాగార్జున్



విచారణ జరుపుతున్న టీజీఈఆర్‌సీ చైర్మన్ నాగార్జున్

సిరిసిల్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సెస్ వినియోగ దారులకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, లూజ్ వైర్లు, సెస్‌లో అవినీతి, బ్యాక్ బిల్లింగ్‌లతో పరిశ్రమలకు ఇబ్బందులు వంటి సమస్యలతో వినియోగదారులు ధ్వజమెత్తారు. మంగళ వారం సిరిసిల్ల పద్మనాయక కళ్యాణ మండపంలో సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం పరిధిలో 2025-26 వార్షిక ఆదాయ ఆవశ్యకత ఛార్జీల నుంచి అంచనా ఆదాయంపై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్ జస్టిస్ బి నాగార్జున్ బహిరంగ విచారణ నిర్వహించారు. సిరిసిల్ల సెస్ పరిధిలో విద్యు త్ సరఫరా ఆదాయ నివేదికను సెస్ ఎండీ విజయేం దర్‌రెడ్డి వివరించారు. అనంతరం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వినియోగదారులు, సంఘాల ప్రతినిధులు కాసా శశిభూషణ్, బియ్యంకార్ శ్రీనివాస్, సిరిసిల్ల రవీందర్, సర్వయ్య, గుంటుక మహేష్, యశ్వంత్‌రెడ్డి, వంశీకృష్ణరావు, ఓరుగంటి రామకృష్ణ, గౌడ వాసు, కొండ ప్రతాప్, పెద్దన్న, గోనె ఎల్లప్ప, పబ్బ నాగరాజు, గరిపెల్లి ప్రభాకర్, పులి లక్ష్మీపతిగౌడ్, నిర్మల, జోగినిపల్లి సంపత్‌రావు, దేవ య్య తదితరులు విద్యుత్ సమస్యలను ఏకరువుపెట్టారు. వివిధ సమస్యలను జస్టిస్ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ నియంత్రణ మండలి చైర్మన్ డాక్టర్, జస్టిస్ బి నాగార్జున్ మాట్లాడుతూ సెస్ పరిధిలో ప్రమాదాలు జరుగుతున్నా వాటిపై రైతులకు వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ప్రణాళిక ఏదీ అని టీజీఈఆర్‌సీ చైర్మన్ డాక్టర్, జస్టిస్ బి నాగార్జున్ అడిగారు. సెస్ టోల్ ఫ్రీ నెంబర్ మోగడం లేదన్నారు.

ప్రమాదాలు 8 వరకు జరిగాయని సెస్ పరిధిలో ఎన్ని రోజులు అవగాహనలు కల్పిస్తున్నారు, కరపత్రాలు వేస్తున్న దానిపై నివేదిక ఇవ్వాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ చార్జీలు పెంపునకు ప్రతిపాదనలు లేవు.

- విజయేందర్‌రెడ్డి సెస్ ఎండీ



సిరిసిల్ల సెస్ పరిధిలో ఏలాంటి విద్యుత్ ఛార్జీల పెంపునకు ప్రతిపాదనలు లేవని కేవలం గ్రీన్ టారిఫ్‌లో 0.66కు ప్రతిపాదించాం. సెస్ పరిధిలో సర్ ఛార్జీలతో కలిపి రూ 883.25 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇందులో వినియోగదారుల నుంచి 161.19 కోట్లు, 50 శాతం పవర్‌లూం సబ్సిడీకి సంబంధించి రూ 99.63 కోట్లు, 2020 జూలై వరకు స్ట్రీట్ లైట్లు నీటి సరఫరాకు సంబంధించి రూ 319.52 ఏరియర్స్ బకాయిలు, వ్యవసాయ సబ్సిడీ బకాయిలు 174.05 కోట్ల రూపాయలు ఉన్నారు. వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం పథకాలకు సంబంధించిన టారిఫ్ ప్రకారం విద్యుత్ సరఫరా చేస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన మారుస్తున్నాం.

సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనం చేయాలి..

- జోగినిపల్లి సంపత్‌రావు, నర్సింగాపూర్ గ్రామ అధ్యక్షుడు



సెస్ బాకీల్లో మునిగిపోతూ ఆస్తులు కోల్పోయిన తీరే పరిస్థితి లేదని, సెస్‌ను ఎన్‌పీడీసీఎల్‌లో విలీనంచేయాలి. సెస్‌లో కరెంట్ కనెక్షన్ మంజూరు విషయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారు. కాలువలు, వాగులలో మోటార్లు పెట్టుకోవ డానికి అనుమతి ఇవ్వాలి. సెస్‌లో టోల్ ఫ్రీ నెంబర్ ఉన్నా పనిచేయడం లేదు. టోల్ ఫ్రీ నెంబర్ ఎన్‌పీడీసీఎల్‌కు అనుసంధానం చేయాలి. విద్యుదాఘాతంతో చనిపోయిన కుటుంబాలకు రూ 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లు తొలగించండి..

- నిర్మల, పదిర



మా ఇంటిపై నుంచి విద్యుత్ వైర్లు వెళ్లాయి. దీని వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. నా కుమారుడు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విద్యుత్ వైర్లు తొలగిం చాలని అనేకమార్లు విజ్ఞప్తులు చేశాను. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ లైన్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలి.

బకాయిలు రద్దు చేయాలి...

- తాటిపాముల దామోదర్, అధ్యక్షుడు ఐక్యవేదిక

కుటీర పరిశ్రమగా పవర్‌లూం రంగం ఉంది. సాంకేతిక సమస్యలతో మరమగ్గాల యూనిట్లకు బ్యాక్ బిల్లింగ్‌తో లక్షల్లో బిల్లులు వేశారు. బిల్లులు కట్టలేక పరిశ్రమలు మూతపడ్డాయి. పది హెచ్‌పీల వరకు ఉన్నా విద్యుత్ రాయితీని 25 హెచ్‌పీలకు పెంచాలి. బ్యాక్‌బిల్లింగ్ బకాయిలను రద్దు చేయాలి.

సోలార్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పాలి

- పులి లక్ష్మీపతిగౌడ్, కిసాన్ సంఘ్ అధ్యక్షుడు

సిరిసిల్ల సెస్ స్వయం సమృద్ధి సాధించడానికి ఎగువ మానేరు, మిడ్ మానేరు, వరద కాలువ బండ్‌లతో పాటు ప్రభుత్వ నిరుపయోగ స్థలాలను ఉపయోగించుకొని సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను నెలకొల్పాలి. కేంద్ర ప్రభుత్వం పీఎం కుసుమ్ పథకాలను సెస్ పరిధిలో అమలు చేయాలి.

చికిత్స పొందుతూ రిటైర్డు కార్మికుడి మృతి

పెద్దపల్లి రూరల్ , మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన జన్నపు రాజిరెడ్డి (72)ని కుటుంబ సభ్యులు రాఘవపూర్‌లోని రెడ్డి సంక్షేమ వృద్ధుల ఆశ్రమంలో పదినెలల క్రితం చేర్పించారు. అప్పటి నుంచి అనారోగ్య సమస్యలు తలెత్తడంతో సోమవారం ఆశ్రమంలో ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. వార్డెన్ గమనించి పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీధర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ స్వామి తెలిపారు.

భర్త, అత్తమామలపై అదనపు కట్నం కేసు

ఎల్లారెడ్డిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం వేధించిన ఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్‌లోని చీకట్ల శ్రీకాంత్, అతడి తల్లిదండ్రులు ఎల్లవ్వ, రాజయ్యలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రమాకాంత్ మంగళవారం తెలిపారు. మండలంలోని అక్కపల్లి గ్రామానికి చెందిన రాధికకు మూడేళ్ల క్రితం హరిదాస్‌నగర్‌లోని శ్రీకాంత్‌తో వివాహమైంది. ఆ సమయంలో పుట్టింటి వారు రూ.11 లక్షల నగదు, తులం బంగారం ఇచ్చి పెళ్లి జరిపించారు. ఏడాది కాలంగా రాధికను భర్త, అత్తమామలు రూ.లక్ష అదనంగా కట్నం తీసుకు రావాలని వేధిస్తున్నారంటూ బాధితురాలు రాధిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

ఇటలీలో రోడ్డు ప్రమాదం : ఒకరి మృతి

- 38 రోజుల అనంతరం ఇంటికి చేరిన మృతదేహం


రషీద్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో అద్దెకు ఉంటున్న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన వ్యక్తి రషీద్(42) ఇటలీలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యాడని స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహం మంగళవారం సిద్ధిపేటకు చేరుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. రషీద్ మూడు నెలల కిందట ఇటలీకి వెళ్లి ట్రక్కు డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఫిబ్రవరి 12న లిథువేనియా నుంచి ఇటలీకి ట్రక్కుతో బయలుదేరాడు. వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి దాటుతున్న క్రమంలో మరో భారీ వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్ర గాయాలపాలైన రషీద్ మృతిచెందాడు. 38 రోజుల అనంతరం ఆయన మృతదేహం ఇంటికి చేరింది. ఎల్లారెడ్డిపేట నుంచి బంధువులు సిద్ధిపేటకు బయలుదేరి వెళ్లారు. మృతుడికి తల్లిదండ్రులు, భార్య, ఇద్దరు పిల్లలు, సోదరులు, సోదరి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇల్లంతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కందికట్క్యూర్ గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బొలుమాల శ్రీనివాస్, ఎలుక దీపికలకు గాయాలయ్యాయి. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్, దీపిక తదితరులు కందికట్క్యూర్ గ్రామంలో జరిగే వారసంతలో కూరగాయలు అమ్మడానికి మంగళవారం ఆటోలో బయలుదేరారు. ఎదురుగా కట్టెల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఇద్దరు గాయపడగా, సిరిసిల్ల ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

నకిలీ ధ్రువపత్రాల కేసులో ఇద్దరి అరెస్టు

ఇల్లంతకుంట, మార్చి 18(ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్య ధ్రువీకరణ పత్రాల కేసులో కత్తి దేవమ్మ, జేరిపోతుల సంజీవ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గాలిపెల్లి గ్రామంలోని పశువైద్యశాలలో ఓఎస్‌గా పనిచేస్తున్న దేవమ్మ కూతురుకు ఉద్యోగం ఇప్పించాలనే ఆలోచనతో మెడికల్ ఇన్‌వాలిడేషన్ సర్టిఫికెట్ కావాలని సంజీవ్‌ను కోరింది. సంజీవ్ రూ.32వేలు తీసుకొని రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి విక్కుర్తి కనుకయ్య సహాయంతో కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆసుపత్రి పేరుతో నకిలీ వైద్యపత్రాలు తయారుచేసి ఇచ్చారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో దేవమ్మ కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుంది. కలెక్టర్ సర్టిఫికెట్లపై విచారణకు ఆదేశించగా నకిలీవని తేలింది. గాలిపెల్లి పశువైద్యాధికారిణి కొండ ఇందిర ఫిర్యాదు మేరకు దేవమ్మ, సంజీవ్‌లను మంగళవారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.15వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన అడువాల నాగరాజు 2017 సంవత్సరంలో అదే మండలంలోని ఓ గ్రామంలో ఒంటరిగా ఉన్న ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు బెదిరింపులకు గురి చేశాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి నాగరాజుకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలి మృతి

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అల్లకొండ రాజవ్వ(70) అనే వృద్ధురాలు మంగళవారం మృతి చెందింది. జగిత్యాల పట్టణంలోని చిలుకవాడకు చెందిన రాజవ్వ ఈ నెల 10న తన ఇంటి నుంచి బయటకి వెళ్లి ప్రధాన రహదారి దాటుతుండగా ఓ కారు అతి వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో వృద్ధురాలికి తీవ్ర గాయాలు కాగా జగిత్యాల ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. తొమ్మిది రోజుల అనంతరం మృతి చెందింది. ప్రమాదానికి కారకుడైన కారు నడిపిన సాయి వివేక్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


జగిత్యాలరూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన మతలాపురం రాజం (55) అనే రైతు అప్పుల బాధతో మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. సాగుకు, ఇంటి అవసరాలకు రూ.10 లక్షల వరకు అప్పులు కావడంతో వాటిని తీర్చలేక నిత్యం తీవ్ర మనస్తాపం చెందేవాడు. మంగళవారం గ్రామ శివారులోని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మంగళసూత్రం అపహరణ

మెట్‌పల్లి రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామ శివారులోని ఎల్లమ్మ అమ్మ వారి దర్శనానికి వచ్చిన మహిళ మెడలోంచి అగంతకుడు బైక్‌పై వచ్చి వెనుక నుంచి మంగళసూత్రాన్ని అపహరించాడు. మంగళవారం నిర్మల్ జిల్లా మునిపల్లి మండలంలోని లక్ష్మణచంద గ్రామానికి చెందిన దొండ రమ్య భర్త, కొడుకుతో కలిసి వెల్లుల్ల ఎల్లమ్మ ఆలయానికి దర్శనానికి మంగళవారం వచ్చారు. దర్శనం అనంతరం వంట చేసుకుని తన కొడుకుకు తినిపిస్తుండగా బైక్‌పై వచ్చిన అగంతకుడు కొంత దూరంలో ఆపి నడుచుకుంటూ వెనుక నుంచి వచ్చి ఆమె మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకుని వెళ్లాడు. ఎస్సై కిరణ్‌కుమార్‌గౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అర్హులకు అందని కిసాన్ సమ్మాన్

ఏడేళ్లుగా ఎదురు చూస్తున్న రైతులు



హుజూరాబాద్‌రూరల్, మార్చి 1 8(ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం ఉన్నా కేంద్రం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన (పీఎం కేఎస్‌వై) ప్రారంభించింది. ఎంత భూమి ఉన్నా పట్టాదారు పుస్తకం ఉన్న వారికి ఏడాదికి మూడు విడతల్లో కలిపి రూ. 6 వేలు ఖాతాల్లో జమ చేస్తోంది. 2019 ఫిబ్రవరి 1 వరకు కటాఫ్ విధించింది. అప్పట్నుంచి కొత్తగా భూములు కొన్న, వారసత్వంగా పొందిన అన్నదాతలకు ఈ పథకం వర్తించడం లేదు. 2018లో భూ ప్రక్షాళన అయ్యాక కొందరి భూములు మిస్సింగ్ పడడంతో తగిన ఆధారాలు చూపి పట్టాదారు పాసు పుస్తకాలు పొందారు. వీరికి కిసాన్ సమ్మాన్ యోజన వర్తించడం లేదు.

కటాఫ్ తేదీలో వర్తించని పథకం

ఈ ఏడాదికి సంబంధించి మొదటి విడత కింద కేంద్రం ఫిబ్రవరిలో మండలంలో 9,282 మంది రైతులకు 55,692,000 రూపాయలు రైతుల ఖాతాల్లో జమ చేసింది. కొత్త వారు మాత్రం ఏడేళ్లుగా నష్ట పోతున్నారు. కటాఫ్ తేదీని తొలగించి పెట్టుబడి సాయం అందిస్తామని ఇటీవల ఓ కేంద్రమంత్రి ప్రకటించిందంతో పథకానికి దరఖాస్తు చేసుకున్న రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

మండలంలోని 19 గ్రామ పంచా యతీల్లో కొత్తగా పట్టాదారు పుస్తకాలు పొందిన, భూ మార్పిడి చేసుకున్న వారు ఉన్నారు. 1,322 మంది పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కోసం దరఖాస్తు చేసుకో గా 430 మంది రైతులు అర్హులుగా వ్యవసాయాధి కారులు గుర్తించారు. ఈ మేరకు రైతు వేదికల్లో వ్యవ సాయ విస్తీర్ణాధికారులతో అవగాహన కల్పించారు. ఏఈఓల ద్వారా లేదంటే మీ సేవ కామన్ సర్వీస్ సెంటర్లలో నమోదు చేసుకుంటే సాయం అందు తుందని తెలిపారు.

ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తేనే..

చాడ భూమిరెడ్డి, ఏవో, హుజూరాబాద్



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి మండలంలో అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తుల పరిశీలన జరిగింది. రైతులు ఆందోళన చెందొద్దు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు వస్తే అర్హులకు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తింపచేస్తాం.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బోయినపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, బాధిత కుటుంబ సభ్యులు న్యాయం చేయాలని రాస్తారోకో చేపట్టారు. ఈ సంఘటన బోయినపల్లి మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. వివరాల ప్రకారం.. గంగాధర మండలం ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన మల్లేశం(42) బోయినపల్లిలో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి గొర్రెల మంద వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి బంధువులు బోయినపల్లి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. వాహన డ్రైవర్‌పై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి, రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ మృతుడి కుటుంబ సభ్యులకు చట్టపరంగా న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి ఆరు నెలల జైలు

జగిత్యాల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అజాగ్రత్తగా వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన ఒకరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.9వేల జరిమానా, గాయపడిన బాధితులకు రూ.30 వేల పరిహారం చెల్లించాలంటూ జగిత్యాల కోర్టు రెండవ అదనపు జ్యుడిషల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వినీల్ కుమార్ మంగళవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొడిమ్యాల పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన పోతర్ల రవి 2019 మే 15న తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి కొడిమ్యాల వైపు వస్తున్నాడు. మ్యాకల అంజయ్య అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనాన్ని అజాగ్రత్తగా, అతి వేగంగా నడుపుతూ నల్లగొండ శ్రీలక్ష్మి నృసింహస్వామి ఆలయం సమీపంలో ఎదురుగా వస్తున్న రవి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో రవితో పాటు అతని కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి కొడిమ్యాల ఎస్సై సతీష్ కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు సరైన సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజని కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి మ్యాకల అంజయ్యకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఆస్తి కోసం అమ్మమ్మను చంపిన దత్తపుత్రుడు

- వెంకటమ్మ హత్య కేసులో వీడిన మిస్టరీ.. నిందితుడి అరెస్టు
- ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్

కరీంనగర్ క్రైం, మార్చి 18(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కొత్తపల్లి శివారులో కెనాల్ వద్ద ఈ నెల 15న జరిగిన వృద్ధురాలి హత్య కేసులో నిందితుడు ఆమె దత్తత తీసుకున్న మనుమడేనని, ఆస్తి కోసం హత్య చేసినట్లు విచారణలో తేలిందని కరీంనగర్ ట్రైనీ ఐపీఎస్, కొత్తపల్లి ఎస్‌హెచ్‌వో వసుంధర యాదవ్ తెలిపారు. మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్‌కు చెందిన వృద్ధురాలు తనుకు వెంకటమ్మ(70)కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కొడుకులు లేకపోవడంతో పెద్ద కూతురు కుమారుడు చంద్రశేఖర్‌ను దత్తత తీసుకొని వివాహం చేసింది. వెంకటమ్మ వద్ద ఉన్న బంగారం, డబ్బులు కూతుళ్లకు ఇస్తుందని, తనకు ఇవ్వకుండా అన్యాయం చేస్తుందని చంద్రశేఖర్ తరచూ ఆమెతో గొడవపడేవాడు. వెంకటమ్మతో గొడవపడిన చంద్రశేఖర్ ఏడాది కాలంగా కరీంనగర్‌లో భార్యతో కలిసి ఉంటున్నాడు. ఎలాగైనా వెంకటమ్మను చంపాలని, తద్వారా ఆమె పేరిట ఉన్న ఆస్తి అంతా తనకు చెందుతుందని భావించాడు.ఈ నెల 15న వెంకటమ్మ కోహెడ మండలం రాంచంద్రాపూర్‌లో తన పెద్ద కూతురు లక్ష్మి వద్ద ఉండగా చంద్రశేఖర్(దత్తపుత్రుడు) ఆమెకు ఫోన్ చేశాడు. ఎల్ఐసీ డబ్బులు తీసుకునేందుకు కరీంనగర్‌కు రావాలని సూచించాడు. వెంకటమ్మ కరీంనగర్ బస్టాండ్‌కు రాగానే చంద్రశేఖర్ పథకంలో భాగంగా అప్పటికే స్నేహితుడి కారుతో సిద్ధంగా ఉన్నాడు. జగిత్యాల ఎల్ఐసీ కార్యాలయంలో డబ్బులు తీసుకుందామని నమ్మబలికి వెంకటమ్మను తీసుకువెళ్లాడు. అక్కడ సాయంత్రం వరకు గడిపి అధికారులు అందుబాటులో లేరని చెప్పి తిరిగి కరీంనగర్‌కు బయల్దేరాడు. మార్గమధ్యలో కొత్తపల్లి శివారులో అదను చూసి వెంకటమ్మపై కత్తితో దాడి చేయడంతో తీవ్రరక్తస్రావంతో ఆమె మరణించింది. చంద్రశేఖర్‌ను అనుమానించిన పోలీసులు విచారణ చేపట్టారు. సోమవారం రాత్రి అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.


ఘటన స్థలంలో పరిశీలిస్తున్న ట్రైనీ ఐపీఎస్ వసుంధర యాదవ్

డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి లబ్ధిదారులు

ఇల్లంతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లకు తమను ఎంపిక చేసినా కేటాయించకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లలో చేరిపోయారు. గత ప్రభుత్వం మండల కేంద్రంలో 40డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించింది. పలుసార్లు గ్రామసభలు నిర్వహించి రెండు సంవత్సరాల క్రితం లబ్ధిదారులను ఎంపిక చేశారు. అప్పటి నుంచి రోడ్డు సౌకర్యం లేదని, ఇతర వసతులు లేవని పంపిణీ చేయడం లేదు. నిర్మాణం జరిగిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని అధికారులు గదులకు తాళాలు వేసి వచ్చారు. అధికారులు ఇళ్లను కేటాయించకపోవడంతో అసహనం చెందిన 10మంది లబ్ధిదారులు మంగళవారం గదులకు వేసిన తాళాలను పగలగొట్టి తమ సామగ్రిని ఇళ్లలో ఉంచి తాళాలు వేసుకొని వచ్చారు. అద్దె ఇళ్లలో తాము ఇబ్బందులు పడుతున్నందున ఇలా చేయవలసి వచ్చిందని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా లబ్ధిదారులు డబుల్‌బెడ్‌రూం ఇళ్లలోకి పోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇప్పటికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు విద్యుత్ సౌకర్యం, డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్డును ఇటీవలే పూర్తి చేశారు.


డబుల్‌బెడ్‌రూంలలో ఉన్న లబ్ధిదారులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


అజయ్‌కుమార్ (ఫైల్)

చిట్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురం తండా ప్రధాన రహదారిపై సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ లక్ష్మీపురం గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ (24) వ్యక్తిగత పని నిమిత్తం భూపాలపల్లికి బయల్దేరాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు 108 వాహనంలో భూపాలపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అజయ్ కుమార్ అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. మృతుడి తండ్రి వీరేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


అజయ్ (ఫైల్)

పాలకుర్తి,మార్చి 18(ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్‌లోని వశారుతినగర్‌కు చెందిన ఆరె అజయ్ (24) అనే యువకుడు మంగళవారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యం బారినపడడంతో తనకు ఏదో అంతు చిక్కని వ్యాధి సోకిందని అభద్రతభావానికి గురయ్యేవాడు. మనస్తాపంతో ఉరివేసుకొన్నాడని, మృతుడి తండ్రి ఆరె లక్ష్మన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇల్లందకుంట వాసికి రాష్ట్ర స్థాయి 35వ ర్యాంక్


పరుశురామ్

ఇల్లందకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామానికి చెందిన బీనవేన పరుశురామ్ గ్రేడ్-2 హాస్టల్ వేల్ఫేర్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. సోమవారం విడుదల చేసిన గ్రేడ్-2 హాస్టల్ వేల్ఫేర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 35వ ర్యాంక్ సాధించి హాస్టల్ వార్డెన్ అధికారిగా ఉద్యోగానికి ఎంపికయ్యాడు. పరుశురామ్‌ది పేద రైతు కుటుంబం. చిన్ననాటి నుంచి కష్టపడి చదివి 2023లో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం పరుశురామ్ కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నాడు. ఉద్యోగం సాధించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి


ప్రజ్ఞాన్ (ఫైల్)

సైదాపూర్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి ఓ బాలుడు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మకల్ గ్రామానికి చెందిన ఎలబోయిన చైతన్య-సురేష్ దంపతులకు ప్రజ్ఞాన్ (2) ఒక్కగానొక్క కుమారుడున్నాడు. మంగళవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రజ్ఞాన్ ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిపోయాడు. ప్రజ్ఞాన్ కనబడడం లేదని కుటుంబ సభ్యులు వెతుకగా, నీటి సంపులో పడి కనిపించాడు. వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం హుజూరాబాద్‌కు తరలించగా అప్పటికే మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

పాఠశాల ఆవరణలో మద్యం సేవించిన సర్వీస్ పర్సన్ తొలగింపు

చందుర్తి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణలో ఓ పదో తరగతి విద్యార్థితో మద్యం సేవించిన సర్వీస్ పర్సన్‌ను విధుల నుంచి తొలగించారు. ఈ సంఘటన చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో మంగళవారం జరిగింది. నర్సింగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వీస్ పర్సన్‌గా పనిచేస్తున్న బండి రాకేష్ పదో తరగతి విద్యార్థితో కలిసి పాఠశాల ఆవరణలో ఎవరూలేని సమయంలో మద్యం సేవిస్తూ, విద్యార్థులను దురలవాట్లకు పురిగొల్పుతున్న విషయం జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు దృష్టికి వెళ్లింది. దీంతో వెంటనే స్పందించిన డీఈవో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జితేందర్‌తో మాట్లాడి సర్వీస్ పర్సన్‌ను తొలగించాలని మౌఖికంగా ఆదేశాలు చేశారు. దీంతో డీఈవో ఆదేశాల మేరకు సర్వీస్ పర్సన్‌ను విధుల నుంచి తొలగించినట్లు మండల విద్యాధికారి వినయ్ కుమార్ తెలిపారు.

మండలాల పునర్విభజన తెచ్చిన తంటా



- ఇబ్బందులు పడుతున్న మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడ గ్రామాల ప్రజలు
- ఎండపల్లి మండలంలో రెవెన్యూ సేవలు
- పోలీస్‌స్టేషన్ పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌లో..
- వెల్గటూర్ మండలంలో వైద్య సేవలు

ఎండపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): మండలాల పునర్విభజనతో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలంలోని మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు వివిధ రకాల సేవల కోసం మూడు ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మూడు గ్రామాల రెవెన్యూ సేవలు ఎండపల్లి మండలంలో, వైద్య సేవలు వెల్గటూర్ మండలంలో, పోలీస్ సేవలు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో కొనసాగుతున్నాయి. మూడు గ్రామాలు గతంలో వెల్గటూర్ మండలంలో ఉండేవి. 2016లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలకుర్తి గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేసి మారేడుపల్లి, ముంజంపల్లి, ఉండెడా గ్రామాలను అందులో విలీనం చేసింది. 2022లో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం తెరపైకి వచ్చింది. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని 12 గ్రామాలు, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలోని మూడు గ్రామాలతో నూతన మండలం ఏర్పడింది. దీంతో రెవెన్యూ, వైద్య, పోలీస్ మూడు కార్యాలయాలు మూడు దిక్కులు అయ్యాయి. మండలం ఏర్పడి మూడు సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు పూర్తి కార్యాలయాలు ఏర్పడలేదు. దీంతో మూడు గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎండపల్లి మండలానికి కొత్త పోలీస్ స్టేషన్ మంజూరు అయ్యే వరకు వెల్గటూర్ స్టేషన్‌లోనైనా ఈ మూడు గ్రామాలను విలీనం చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం

పల్లె అశోక్, మాజీ సర్పంచ్, ముంజంపల్లి



మా గ్రామానికి సంబంధించి రెవెన్యూ, వైద్యం, పోలీసు శాఖలు మూడు మండలాల కలయికతో ఉన్నాయి. దీంతో గ్రామస్థులు వివిధ పనుల కోసం మూడు ప్రాంతాలకు వెళ్లలేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కొత్త మండలానికి పోతే మీ గ్రామం పాత మండలంలోనే ఉందని, పాత మండలానికి పోతే మీది కొత్త మండలంలో ఉందని అధికారులు చెప్పడంతో ఏమీ చేయలేక ఇక్కట్లు పడుతున్నాం. ప్రజాప్రతినిధులు, అధికారులు మా సమస్యను తొందరగా పరిష్కరించాలి.

మావి ఎటుకాని బతుకులు అయ్యాయి

కొమ్ము శ్రీకాంత్, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు



నూతన మండలం ఏర్పడినపుడు మా సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్నాం కాని ఇంకా పెరిగాయి. పోలీస్ స్టేషన్ పరిధిని బసంత్ నగర్ నుంచి మార్చి కొత్త స్టేషన్ ఏర్పడే వరకు వెల్గటూర్‌లోనైనా కలపండి. మావి ఇప్పుడు ఎటు కాని బతుకులు అయ్యాయి.

దేశం గర్వపడేలా క్రీడాకారులు ఎదగాలి

- హుజూరాబాద్‌లో టర్ఫ్ కోర్ట్ ఏర్పాటుకు కృషి
- కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్
- ముగిసిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు
- విజేతగా మెదక్.. రన్నరప్‌గా నిజామాబాద్ జట్టు



విజేతగా నిలిచిన మెదక్ జట్టుకు కప్‌ను అందజేస్తున్న వొడితెల ప్రణవ్, ఏసీపీ శ్రీనివాస్‌జీ

హుజూరాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు దేశం గర్వపడేలా ఆటలు ఆడి ఎదగాలని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో మూడురోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు మంగళవారం ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వొడితెల ప్రణవ్ మాట్లాడుతూ హుజూరాబాద్ వేదికగా అనేక రకాలన క్రీడా టోర్నమెంట్‌లు జరగాలన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో విద్యా, వైద్యంతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తామని, మైదానాలకు సరిపడా నిధులు కేటాయిస్తామన్నారు. హుజూరాబాద్‌లో టర్ఫ్ కోర్ట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబులతో మాట్లాడి కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో క్రీడలకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. టోర్నమెంట్ నిర్వహించిన ఆర్గనైజింగ్ సెక్రెటరీ, క్లబ్ సభ్యులను అభినందించారు.

అనంతరం ఏసీపీ శ్రీనివాస్‌జీ మాట్లాడుతూ క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించు కోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. గెలుపొందిన జట్లకు హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్, ఏసీపీ శ్రీనివాస్‌జీ, ఆర్గనైజర్లు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర హాకీ అసోసియేషన్ సెక్రటరీ భీమ్‌సింగ్, రాష్ట్ర హాకీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ కళ్యాణి, జిల్లా హాకీ అసోసియేషన్ సెక్రటరీ సురేందర్‌సింగ్, బి శ్రీనివాస్, తోట రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాస్, ఉమామహేశ్వర్, టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, శ్రీనివాస్, పవన్, పీటీలు శ్యాంసుందర్, రవికుమార్, విశ్రాంత, రాజిరెడ్డి, ప్రభాకర్, తిరుపతి, సజ్జు, సాయికృష్ణ, రాకేష్, రాజేష్, విక్రమ్, సాంబరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హోరాహోరీగా హాకీ పోటీలు

హుజూరాబాద్‌లోని హైస్కూల్ మైదానంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలు చివరిరోజు హోరాహోరీగా సాగాయి. కరీంనగర్, మెదక్, హైదరాబాద్, నిజామాబాద్ జట్లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. మొదటి సెమీ ఫైనల్స్‌లో కరీంనగర్‌పై మెదక్ 3-1తో విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. రెండో సెమిఫైనల్స్ హైదరాబాద్‌పై నిజామాబాద్ 1-0తో విజయం సాధించి ఫైనల్‌కు చేరుకుంది. థర్డ్ ప్లేస్ కోసం హైదరాబాద్, కరీంనగర్ జట్లు తలపడగా ఇరుజట్లు చెరొక గోల్ చేయడంతో డ్రాగా ముగిసింది. ఎంపైర్లు స్ట్రోక్ ద్వారా విజేతను నిర్ణయించేందుకు ఇరుజట్ల కెప్టెన్లతో సంప్రదించి నిర్ణయం తీసుకున్నారు. హైద్రాబాద్‌లో 4గోల్స్ చేయగా, కరీంనగర్ 2 గోల్స్ చేయడంతో హైద్రాబాద్ గెలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో మెదక్- నిజామాబాద్ జట్లు పోటీపడగా 4-1తో మెదక్ విజయం సాధించి విజేతగా నిలిచింది. రన్నరప్‌గా నిజామాబాద్, మూడో స్థానంలో హైద్రాబాద్ సరిపెట్టుకుంది.

కొండగట్టులో టెండర్లు ఖరారు

మల్యాల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం పరిధిలో నిర్వహించే పలు దుకాణాలకు మంగళవారం నిర్వహించిన పలు టెండర్లు ఖరారు అయ్యాయి. ఏడాది కాల పరిమితితో హోటల్, ఫొటో స్టూడియో, సామాన్లు భద్రపరచుకునే హక్కు, స్నానాలు, మరుగుదొడ్లు, కిరాణం, కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీం, చెప్పులు భద్రపరచడం, వంట చెరుకు అమ్మకం, పాదరక్షలు, టాయిలెట్స్ నిర్వహణకు ఈ-టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగవేలం నిర్వహించారు. ఈ వేలంలో హోటల్ నిర్వహణకు రూ.18.25లక్షలు, కిరాణ సామగ్రి రూ.12.15లక్షలు, కూల్‌డ్రింక్స్ రూ.16.50 లక్షలు, లాకర్‌రూం రూ.18లక్షలు, ఫొటో స్టూడియో రూ.22 లక్షలు, వంట చెరుకు రూ.80వేలు, పాద రక్షలకు రూ.9,99,999, మామిడి తోట నిర్వహణకు రూ.10వేలకు ఖరారు అయినట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. అలాగే గుట్ట కింది దుకాణం-10కి రూ.56వేలు, దుకాణం-13కు రూ.55వేలు పలికినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహర నాథ్, చంద్రశేఖర్, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

ఓసీల్లోని పేదలకు 'రాజీవ్ యువ వికాస్' వర్తింపజేయాలి

ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పాలాడి రామారావు



మాట్లాడుతున్న పాలాడి రామారావు

కరీంనగర్ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): అగ్రకులాలు (ఓసీ)ల్లో ఆర్థికంగా వెనుకబడిన నిరుద్యోగ యువతకు రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వర్తింపజేయాలని ఓసీ సామాజిక సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో ఓసీ జేఏసీ నాయకులతో ఏర్పాటు చేసిన సమా వేశంలో మాట్లాడారు. ఓసీల్లోని పేదలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఓసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నిధులు విధివిధానాలను పాలకమండలిని ఇప్పటి వరకు ప్రకటించకపోవడం సరికాదన్నారు. నిరుద్యోగయువతకు ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాజీవ్ యువ వికాస్ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం హర్షనీయమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఓసీ సామాజిక నిరుద్యోగ యువతకు వర్తింపజేయక పోవడం శోచనీయమన్నారు. జేఏసీ నాయకులు నర్సింహారెడ్డి, రాజిరెడ్డి, స్వామిరెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, సంజీవరెడ్డి, రాజన్న, సమ్మిరెడ్డి, సంపత్‌రావు, గోపాల్‌రావు, సరోజనా జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



క్షయ నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

- పెద్దపల్లి జిల్లాలో వంద రోజుల ప్రణాళిక
- గ్రామ గ్రామాన సర్వే, వ్యాధిగ్రస్తుల గుర్తింపు
- ఉచితంగా మందుల పంపిణీ
- జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో పెద్దపల్లి జిల్లా ఎంపిక
- గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంగా కార్యాచరణ



గర్రెపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం

సుల్తానాబాద్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పైలట్ ప్రాజెక్టులుగా ఎంపిక చేసింది. వాటి పరిధిలో క్షయ రహిత జిల్లాలుగా తీర్చదిద్దడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా పెద్దపల్లి జిల్లాను ఎంపిక చేసింది. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీ వేదికగా జిల్లాలో టీబీ నిర్మూలన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. టీబీ లేని జిల్లాగా మార్చడానికి చర్యలు ప్రారంభించారు. ప్రాణాంతకమైన క్షయ వ్యాధిని నిర్మూలించేందుకు పీహెచ్‌సీలలో వంద రోజుల కార్యక్రమాన్ని అమలు చేసి క్షయ రహిత రాష్ట్రంగా చేయడానికి క్షేత్ర స్థాయిలో చర్యలు చేపట్టింది. దేశంలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడానికి దేశ వ్యాప్తంగా 347 ఆరోగ్య కేంద్రాలను ఎంపిక చేసింది. తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిది కేంద్రాలను సెలక్ట్ చేయగా అందులో పెద్దపల్లి జిల్లా ఉంది. అత్యధిక క్షయ రోగులు ఉన్న పెద్దపల్లి జిల్లాను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేశారు. వంద రోజులలో రోజు వారి ప్రణాళిక ప్రకారం అనుమానితులను గుర్తించడం, వారికి పరీక్షలు నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ అనంతరం అవసరమైన మందులను ఇస్తూ వాటిని క్రమం తప్పకుండా వాడేలా ప్రోత్సహించడం వంటి చర్యలను ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు పర్యవేక్షిస్తున్నారు. మందులతో పాటు వారు పౌష్ఠికాహారం తీసుకునేలా చూడడం వీరి బాధ్యతే. క్రమం తప్పకుండా మందులు, పౌష్ఠికాహారం తీసుకోవడం ద్వారా వంద రోజులలో క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించడం ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

రూ.25 లక్షలతో పౌష్ఠికాహారం పంపిణీ

ఎస్ ఫణిశంకర్, రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ అసోసియేషన్ అధ్యక్షులు

రోగులు సత్వరంగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావడమే లక్ష్యంగా టీబీ వ్యాధిగ్రస్థులకు పౌష్ఠికాహారాన్ని అందించాలని ప్రభుత్వం సూచించింది. ఈ పౌష్ఠికాహారాన్ని సమకూర్చడానికి తమ సంస్థ ద్వారా రూ.25 లక్షలను ఇచ్చాం. తద్వారా 3000 కిట్లను సమకూర్చి వాటిని అభయ ఫౌండేషన్ వారికి అప్పగించారు. వారు ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఆరు నెలల పాటు రోగులకు నెల నెలా పౌష్ఠికాహారాన్ని అందజేస్తారు. ఒక్కొక్క కిట్‌లో ఏడు వందల రూపాయల విలువ చేసే ప్రోటీన్ పౌడర్, దాంతో పాటు కొర్రలు, మంచి బియ్యం, పప్పులు, చక్కెర, నూనె వస్తువులు ఉంటాయి.

టీబీ సోకిన వారు జాగ్రత్తగా వ్యవహరించాలి : గర్రెపల్లి పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్



క్షయ ప్రాణాంతకమైన వ్యాధి. పైగా అంటువ్యాధి కూడా. సరైన సమయంలో గుర్తించి కుటుంబ సభ్యులు దూరంగా ఉంటూ మందులు వాడుతూ బలమైన ఆహారాన్ని తీసుకోవాలి. తెమడ, ఎక్స్‌రే వంటి పరీక్షలు చేయించుకోవాలి. వ్యాధి ముదరక ముందు ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. గతంలో టీబీ వచ్చి తగ్గిన వారు మిగతా వారికి సహకరించాలి. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడాలి. ఇతరులకు దగ్గరగా తుమ్మడం, దగ్గడం వంటివి చేయకూడదు. తుంపర్ల ద్వారా ఆ వ్యాధి ఇతర కుటుంబ సభ్యులకు సోకే ప్రమాదం ఉంది. ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయకూడదు.



పంపిణీకి సిద్ధం చేసిన కిట్లు



టీబీ రహిత రాష్ట్రంగా చేయాలి

వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరక్టర్ రాజేశం



టీబీని రాష్ట్రం నుంచి పారదోల డానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ క్షయ నిర్మూలన పథకం అమలు చేస్తుంది. రాష్ట్రంలో టీబీ కేసు లు లేకుండా చేయడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. వంద రోజుల కార్యక్రమాన్ని గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంలో పారంభించారు. అన్ని పీహెచ్‌సీల పరిధిలో రోగులను గుర్తించి మందులు ఇస్తున్నాం. ఆకలి లేకపోవడం, సన్నబడడం జ్వరం రావడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ఏఎన్‌ఎంను ఆశాలను సంప్రదించాలి. రాష్ట్రంలోని పలు జిల్లాలను పరిశీలించిన అనంతరం పెద్దపల్లి జిల్లాను ఎంపిక చేశాం. దేశంలోనే టీబీ రోగులు అధికంగా ఉన్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ఇచ్చాయని, దాంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి 2030కల్లా టీబీని నిర్మూలించేందుకు ప్రధానమంత్రి లక్ష్యంగా నిర్ణయించారు. అంతకన్నా ముందే లక్ష్యాన్ని చేరుతాము. క్షయ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయడానికి కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రామగుండం కేంద్రంలో రూ.25 లక్షలతో మొబైల్ ఎక్స్‌రే మిషన్ సమకూర్చారు. రోగులకు సౌలభ్యంగా వారి వద్దకే వెళ్లిఎక్స్‌రేలు తీస్తున్నారు. ప్రభుత్వ లక్ష్యానికి తోడు అభయ ఫౌండేషన్ వారు తమ సేవలను అందిస్తున్నారు. దాతలు సమకూర్చిన పౌష్ఠికాహారాన్ని ఆరు నెలల పాటు ఆయా పీహెచ్‌సీల పరిధిలో పంపిణీ చేస్తున్నారు.

లక్ష్యానికి మించి క్షయ పరీక్షలు

అన్నప్రసన్న కుమారి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి



జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి పీహెచ్‌సీ కేంద్రంగా వ్యాధి నిర్మూలన చర్యలు చేపట్టాం. జిల్లాలో నిర్వహిస్తున్న నిక్షయ్ శివిర్ వంద రోజుల కార్యక్రమంలో హైరిస్కు జనాభాగా లక్షా 19 వేల 746 మందిని గుర్తించాం. లక్ష 22 వేల 421 మందికి టీబీ స్క్రీనింగ్ టెస్టులు చేశాం. వీరిలో 12 వేల 635 మందిని అనుమానితులుగా గుర్తించాం. జిల్లాలో మొత్తం 426 మందిని క్షయ వ్యాధిగ్రస్తులుగా గుర్తించాం. గతంలో ఉన్న 74 మందితో ప్రస్తుతం జిల్లాలో 500 మంది క్షయ రోగులు ఉన్నారు. జిల్లాలోని బేగంపేట ఆరోగ్య కేంద్రం పరిధిలో 25 మంది, ఎలిగేడ్‌లో 16, గద్దలపల్లిలో 83, గర్రెపల్లిలో 64, జూలపల్లిలో 25, కమాన్‌పూర్‌లో 31, కొలనూర్‌లో 3, నంది మేడారంలో 51, ముత్తారంలో 23, ఓదెలలో 20, రాఘవపూర్‌లో 42 మంది, రాగినేడులో 85 మంది, శ్రీరాంపూర్‌లో 23 మంది రోగులను గుర్తించి వారికి నెల నెలా మందులతోపాటు ఉచితంగా పౌష్ఠికాహారం కిట్లను అందిస్తున్నాము.



రోగులకు పంపిణీ చేసే కిట్లలోని సరుకులు

శివ కల్యాణం సందర్భంగా స్వామివారి పల్లకీ సేవ





పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఉద్యోగులు, అర్చకులు, దేవరాజు నాగార్జున్‌కు రాజన్న చిత్రపటం అందజేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజు శివ కల్యాణోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి తీర్థరాజస్వామి పూజ, బలిహరణము నిర్వహించారు. స్వామి వారికి ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు నుంచి ఔపాసనము బలిహరణము రాత్రి 8.15 గంటలకు కల్యాణ మండపంలో సదస్యము, అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ..

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు మట్టి పాత్రల్లో అమ్మవారికి నైవేద్యాన్ని వండుకుని డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా శివసత్తుల నృత్యాలతో అమ్మవారి ఆలయాన్ని చేరుకుని పట్నాలు, ఒడిబియ్యం, నూతన వస్త్రాలు సమర్పించారు.

రాజన్నను దర్శించుకున్న స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్

వేములవాడ రాజరాజేశ్వర స్వామివారిని రిటైర్డ్ జస్టిస్, స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ దేవరాజు నాగార్జున్ మంగళవారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు ముందుగా ఆలయ అర్చకులు, వేద పండితులు స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొని కోడె మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం స్వామివారి కల్యాణ మండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా, ఈవో వినోద్ రెడ్డి రాజన్న చిత్రపటాన్ని అందజేశారు. వెంట ఏఈవో బ్రహ్మన్న గారి శ్రీనివాస్, సూపరింటెండెంట్ శ్రీకాంతచారి, ఆలయ ఇన్‌స్పెక్టర్ నరేందర్ జూనియర్ అసిస్టెంట్ సంహాచారి ఉన్నారు.



బద్దిపోచమ్మ ఆలయం వద్ద భక్తుల రద్దీ

వేంకటేశ్వరుడి దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు

ధర్మపురి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేంకటేశ్వరస్వామి దక్షిణ, ఉత్తర దిగ్యాత్ర మంగళవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు స్వామి వారల ఉత్సవమూర్తులను దక్షిణ దిశలో గల పోలీస్ స్టేషన్, ఉత్తర దిశలో గల ఉసిరిక వాగు వద్దకు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి దంపతులు, ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ దంపతులు, బుగ్గారం ఎస్‌ఐ శ్రీధర్‌రెడ్డి దంపతులు, వెల్గటూర్, గొల్లపల్లి ఉమాసాగర్, సతీష్ దంపతులు, పోలీస్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు జరిపారు.

ఎనిమిదో రోజు ఆదాయం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయానికి రూ.3,88,685 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్ తెలిపారు. వీటిలో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.2,94,168 ప్రసాదాల విక్రయం ద్వారా రూ.85,500 లభించాయి. అన్నదానం కోసం భక్తులు రూ.9,016 విరాళాలు సమర్పించినట్లు ఆయన వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, 3 గంటలకు రథోత్సవం ఉంటుంది. రాత్రి 7 గంటలకు చక్రతీర్థం, 9 గంటలకు స్వామివారల పుష్పయాగం ఉంటుంది. స్థానిక శేషప్ప కళా వేదికపై శ్రీరాంభట్టర్ భాగవతార్ హరికథ కాలక్షేపం ఉంటుందని ఈవో శ్రీనివాస్ తెలిపారు.

నరసింహుడి సన్నిధిలో ప్రముఖులు

లక్ష్మీ నరసింహస్వామి వారిని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేషవస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి సత్కరించారు. ఆయన వెంట ఎస్‌బీఐ డీజీఎం బిజయ్‌కుమార్ సాహు, గోదావరిఖని ఆర్‌ఎం రవీంద్రకుమార్, మంచిర్యాల ఆర్‌ఎం రితేష్‌కుమార్, ధర్మపురి బ్రాంచ్ మేనేజర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

- లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని కామినేని హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శశిధర్ కుటుంబ సమేతంగా మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శశిధర్ దేవాలయంలో జరిగే అన్నదానం కోసం రూ.1,00,000 విరాళాన్ని అందించారు.



వేంకటేశ్వరస్వామి వారల ఊరేగింపు సేవ

సైకిల్‌కు స్టీరింగ్



సైకిల్‌కు స్టీరింగ్ ఏర్పాటు చేసిన జాషువా

జగిత్యాల అర్బన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణానికి చెందిన కొండ జాషువా అనే 8వ తరగతి విద్యార్థి తన సైకిల్‌కు స్టీరింగ్ అమర్చాడు. ఇంట్లో ఉన్న ఓ పాత స్టీరింగ్ తీసుకుని బ్రేక్‌లు చేతులకు అనుకూలంగా ఉండేలా అమర్చాడు. సైకిల్‌కు బ్యాటరీ సైతం అమర్చి హారన్ పెట్టాడు. పట్టణంలోని రోడ్లపై స్టీరింగ్ సైకిల్‌తో హారన్ కొడుతూ తిరుగుతున్న సదరు బాలుడి సైకిల్‌ను జనాలు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ ఆలోచన ఎలా వచ్చిందని ప్రశ్నించగా ఇంట్లో పనికి రాకుండా ఉన్న పాత స్టీరింగ్ తీసుకుని స్నేహితుడి సహాయంతో సైకిల్‌కు స్టీరింగ్ అమర్చానని, నడపడానికి అనుకూలంగా ఉందని జాషువా తెలిపాడు.

కుక్కకాటుకు గురైన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి

- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి
- ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ నాయకుల ధర్నా

సిరిసిల్ల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కుక్కకాటుకు గురైన విద్యార్థి సువర్ణకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఈ సంఘటనకు కారుకులైన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, మల్లారపు ప్రశాంత్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావులు డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గురుకుల పాఠశాలను విద్యార్థిని తల్లిదండ్రులు డెవిడ్‌రాజు-కృపారాణిలతో కలిసి నాయకులు సందర్శించి పరిసరా లను పరిశీలించారు. అనంతరం పాఠశాల ప్రధాన ద్వారం ఎదుట మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీతో పాటు ఏబీవీపీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నాయకులు ధర్నాలు చేశారు. ఈ సంద ర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ గురు కుల పాఠశాలలోకి కుక్కలు వెళ్లి విద్యార్థులపై దాడిచేసి గాయ పర్చడం బాధాకరమన్నారు. కలెక్టర్ స్పందించి గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు. కుక్క కాటుకు గురైన సువర్ణకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అసుపత్రిలో చికిత్స పొందుతున్న సువర్ణను ఎస్ఎఫ్ఐ నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్ కుమార్, నాయకులు రాకేష్, మనోఅభిషేక్, వినయ్ పాల్గొన్నారు.



చిన్నబోనాల గురుకుల పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఏబీవీపీ అధ్వర్యంలో..

సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాల గురుకుల పాఠశాలలో కుక్క కాటుకు గురైన విద్యార్థికి వైద్యం అందించడంతో పాటు అ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదు కోవడంతోపాటు నిర్లక్ష్యం వహించిన ప్రిన్సిపాల్‌తో పాటు వాచ్‌మన్, అటెండర్‌లను సస్పెండ్ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు డిమాండ్ చేశారు. చిన్నబోనాల గురుకుల పాఠశాల ఎదుట ఏబీవీపీ జిల్లా కమిటీ అధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ కార్యదర్శి ఎనుగందుల శ్రీనివాస్, పూసాల కార్తీక్, గణేష్, పాకచరణ్ పాల్గొన్నారు.

ఒకటి రెండు రోజుల్లోనే ధ్రువీకరణ పత్రాలు జారీ..

- మారుతిరెడ్డి, తహసీల్దార్ వీర్నపల్లి



ఆంధ్రజ్యోతి: రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో స్లాట్‌బుక్ చేసుకుని నేరుగా వస్తున్నారా?

తహసీల్దార్ : రైతులు నేరుగా సంప్రదిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ప్రజలకు వివిధ సర్టిఫికెట్లు ఎన్ని రోజుల్లో అందిస్తున్నారు?

తహసీల్దార్: కుల, ఆదాయ, నివాస, ఇతర సర్టిఫికెట్ల జారీ విషయంలో ఒకటి రెండు రోజుల్లో అందజేస్తున్నాం. ఎప్పుడైనా సర్వర్ ప్రాబ్లం వస్తే ఆపరేటర్‌కు ఎక్కువ సమయం కేటాయించి పనులు పెండింగ్ లేకుండా పూర్తి చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో మొత్తం సర్వే నంబర్లు ఎన్ని ఉన్నాయి. భూవిస్తీర్ణం ఎంత ఉంది?

తహసీల్దార్: మండలంలో మొత్తం సర్వే నంబర్లు 1050 ఉన్నాయి.భూవిస్తీర్ణం 27687 వరకు ఉంది. ఇందులో రెవెన్యూ, ఫారెస్ట్, ప్రభుత్వ భూమి ఉంది.

- వీర్నపల్లి (ఆంధ్రజ్యోతి)

అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

వేములవాడ, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపిన నేపథ్యంలో వేములవాడలో అంబేద్కర్ విగ్రహానికి తెలంగాణ రాష్ట్ర మోచి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ్లెపు ముత్యం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. నాయకులు బాలయ్య, గోపి, శ్రీనివాస్, సాయిలు బిక్షపతి, చిన్నబాలయ్య పాల్గొన్నారు.

సన్మానం

ఎల్లారెడ్డిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎంపీ, పీఎంపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రాచర్లగొల్లపల్లిలోని ఆర్ఎంపీ ప్రవీణ్‌రెడ్డిని వీర్నపల్లి మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు, రెడ్డి ఎంప్లాయిస్, ప్రొఫెషనల్ అసోషియేషన్ ఆధ్వర్యంలోని సభ్యులు మంగళవారం వేర్వేరుగా సన్మానించారు.

డబ్బులు అప్పగింత..

సిరిసిల్ల క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణానికి చెందిన జిందం శ్రీధర్ ఎంఆర్ఎఫ్ షోరూం వద్ద నుంచి వెళుతుండగా మంగళవారం రూ.10వేలు పడిపోయాయి. డబ్బులు దొరికిన వ్యక్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించాడు. శ్రీధర్‌ను సీసీ కెమెరాల సహాయంతో వెతికిపట్టుకొని నగదును పోలీసులు అప్పగించారు.

విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్

సిరిసిల్ల టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కుక్కకాటుకు గురై గాయపడిన విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వైద్యులను ఆదేశించారు. సిరిసిల్ల పట్టణం చిన్నబోనాల సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంలో సోమవారం ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థిని గొట్టిముక్కల సువర్ణ విద్యాలయం ఆవరణలో కుక్కల దాడిలో గాయపడింది. వెంటనే విద్యాలయం సిబ్బంది సిరిసిల్లలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలకు తరలించారు. మంగళవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని సువర్ణను పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితులను ఆసుపత్రి సూపరింటెండెంట్ లక్ష్మీనారాయణను అడిగి తెలుసుకున్నారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించి కుదుట పడ్డాక డిచ్చార్జి చేయాలని వైద్యులను ఆదేశించారు. విద్యార్థిని సువర్ణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకుంటామని ఆమె తల్లిదండ్రులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని వార్డులను, బ్లడ్‌బ్యాంక్‌ను పరిశీలించారు.

వార్డులో అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న పేషంట్లతో కలెక్టర్ మా ట్లాడి ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై వారి అభిప్రా యాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని పేషం ట్లకు మెరుగైన వైద్యం అందించడంలో అలసత్వం ప్రదర్శించకుండా విధులు నిర్వర్తించాలని వైద్యులను, సిబ్బందిని ఆదేశించారు.



విద్యార్థిని సువర్ణను పరామర్శిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

చిన్నబోనాల గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లను నిర్మించాలి..

సిరిసిల్ల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో మరుగుదొడ్లు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారని, కలెక్టర్ స్పందించి మరుగుదొడ్లను నిర్మించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా ఆసుపత్రికి వెళ్లి కుక్కల దాడిలో గాయ పడి చికిత్స పొందుతున్న సు వర్ణను పరామర్శించారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించగా గత ఏడాది నుంచి మరుగుదొడ్లతో పాటు సంబంధించిన పైపులైన్ కూడా శిథిలావస్థకు చేరి పనికి రాకుండా పోవడంతో విద్యార్థినీలు వాష్ రూం కోసం బయటకు వెళ్లే పరిస్థితి నెలకొందని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి హాస్టల్‌ను పరిశీలించి మరుగుదొడ్లతో పాటు మౌళిక వసతులను కల్పించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి కొండ నరేష్, ఉపాధ్యక్షుడు గా జుల సదానందం, మోర శ్రీహ రి, ఊరగొండ రాజు,పంపరి అర్జున్, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు అంకారపు రాజు, వేముల సురేష్, మేర్గు శ్రీనివాస్, కొంపల్లి మురళి, కోడం బాలకిషన్, మామిడాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విచక్షణా జ్ఞానం..

- సిరిసిల్ల ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో రాధాబాయి

సిరిసిల్ల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే విచక్షణ జ్ఞానం లభిస్తుందని వ్యక్తి విజయానికి విద్యమూలమని ఇది వజ్రాయుధమని సిరిసిల్ల ఇంచార్జ్ ఆర్డీవో ఆర్వీ రాధాబాయి అన్నారు. సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కుసుమరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంచార్జ్ ఆర్డీవో మాట్లాడుతూ విద్యతోనే జీవితాన్ని సరైన దిశలో మలుచుకునే సామర్థ్యం లభిస్తుందన్నారు. విద్య అనేది జ్ఞానాన్ని అందించడం లేదా సంపాదించడం ద్వారా పరిణితి చేకూరుతుందన్నారు. వ్యక్తిగత జీవితాన్ని కాకుండా సమాజ వికాసానికి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లకావత్‌మోతీలాల్, అమ్మ అదర్శ పాఠశాల చైర్మన్ ఉమా, మాజీ కౌన్సిలర్ గెంట్యాల శ్రీనివాస్, స్టాఫ్ కార్యదర్శి మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలపై ప్రజలకు అవగహన కల్పించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపీ



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపీ

సిరిసిల్ల రూరల్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : జమిలి ఎన్నికలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏకకాలిక ఎన్నికల సంస్కరణ కార్యశాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపీ మాట్లాడుతూ దేశంలో ఒకే ఎన్నికలను నిర్వహించాలని 1984 సంవత్సరంలోనే బీజేపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామపంచాయతీ నుంచి పార్లమెంట్ స్థాయి వరకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడం వలన ఎన్నికల చక్రాలను సరళీకృతం చేయడంతోపాటు ఖర్చులు తగ్గుతాయన్నారు. దీనిపై ప్రజలందరికి అవగహన కల్పించేందుకు బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యాన రాంప్రసాద్, జిల్లా ఇంచార్జ్ రేగుల మల్లికార్జున్, సిరిసిల్ల నియోజకవర్గ కన్వీనర్ కారెడ్ల మల్లారెడ్డి, సంతోష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు భరోసా లభించేనా..?

(5వ పేజీ తరువాయి)

ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మారిపోయి బీజేపీ ప్రభుత్వం రావడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. 2016 బడ్జెట్ సమయంలో మంత్రి కేటీఆర్ మూడుసార్లు ఢిల్లీకి వెళ్లి, అప్పటి చేనేత జౌళి శాఖ మంత్రి సంతోష్ గంగువార్‌లను కలిసి వస్త్ర పరిశ్రమ సమస్యలను వివరించారు. మెగా పవర్‌లూం క్లస్టర్ ప్రతిపాదనలు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి పంపించామని తెలపడంతో ఆ బడ్జెట్‌లో పవర్‌లూం క్లస్టర్ చోటుదక్కుతుందని భావించారు. మొదటి విడతలో దేశంలో ఐదు మెగా క్లస్టర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా సిరిసిల్లకు చోటు దక్కలేదు. 2017 బడ్జెట్ సమయంలో అప్పుడు చేనేత జౌళి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్, అప్పటి ఎంపీ వినోద్‌లు చేనేత జౌళి శాఖ మంత్రి స్మృతి ఇరానీని కలిసి మెగా పవర్‌లూం క్లస్టర్‌ను సాధించుకునే విధంగా చర్యలు చేపట్టారు. కానీ ఆ బడ్జెట్‌లో కూడా మోక్షంలభించలేదు. అదేక్రమంలో 2018, 2019, 2020, 2021, 2022, 2023, 2024, 2025 కేంద్ర బడ్జెట్‌లో కూడా అదే పరిస్థితి ఎదురైంది. ప్రస్తుత రాష్ట్ర బడ్జెట్‌లో సిరిసిల్ల వస్త్రోత్పత్తికి భారీగా కేటాయింపులు ఉంటాయని భావిస్తున్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై అవగాహన ఉన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లు ఆ దిశగా కృషి చేస్తారని భావిస్తున్నారు. సిరిసిల్ల టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి నిధులు కేటాయిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నారు.

● **ప్రభుత్వ ఆర్డర్లతో ఊరట..**

సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ జవసత్వాలు కోల్పోతున్న క్రమంలో ప్రభుత్వం కార్మికులకు ఉపాధిపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ ఆర్డర్లతో కాస్త ఊరట మొదలైంది. సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు గత ప్రభుత్వం బతుకమ్మ చీరల పేరిట రూ.350 కోట్ల వరకు ఆర్డర్లను అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ ఆర్డర్లను నిలిపివేసింది. దీంతో పనులు లేక ఉపాధి కోల్పోయి కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి ఏర్పడింది. ఒడిదొడుకుల ప్రస్థానంలో ప్రభుత్వం స్వశక్తి మహిళల కోసం రెండు చీరలు అందించాలని నిర్ణయించి సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆర్డర్లను అందించింది. 1.30 కోట్ల స్వశక్తి చీరల ఆర్డర్లతో పాటు ఆర్వీఎంకు సంబంధించిన బట్ట ఉత్పత్తి ఆర్డర్లు కూడా ఇచ్చారు. గత ప్రభుత్వం హయాంలోని బకాయిలను విడుదల చేశారు. యారన్ డిపో ద్వారా రాయితీపై నూలును అందిస్తున్నారు. వర్కర్ టు ఓనర్ పథకంలో కార్మికులకు ఉపాధి కల్పించడానికి దృష్టి పెట్టారు. కార్మికులను యజమానులుగా మార్చడానికి చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే టెక్స్‌టైల్ జోన్ కూడా ముందుకు వస్తుందని కార్మికులు ఆసక్తిగా బడ్జెట్ వైపు చూస్తున్నారు.

డాక్టర్ అక్షయ్‌కుమార్‌కు గోల్డ్‌మెడల్

సిరిసిల్ల, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ అక్షయ్‌కుమార్ కోలాపూర్‌లోని డీవై పాటిల్ మెడికల్ కాలేజీలో ఎండీ పూర్తి చేసి మంగళవారం గోల్డ్‌మెడల్‌ను అందుకున్నందుకు ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్లు అభినందించారు. సిరిసిల్లలోని సామాన్య కుటుంబం నుంచి జనరల్‌మెడిసిన్ పూర్తి చేయడంతో పాటు ఎండీగా గోల్డ్‌మెడల్ సాధించడంపై ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ చింతోజు శంకర్, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ రమణారావు, డాక్టర్ ప్రసాద్‌రావు, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ శీరిష, డాక్టర్ సంతోష్‌చారి, డాక్టర్ అకాంక్ష, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, రమాదేవి, ఈష్‌కుమార్‌లు అభినందనలు తెలిపారు.

ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ బదిలీ

ఎల్లారెడ్డిపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేటలో విధులు నిర్వహిస్తున్న తహసీల్దార్ బోయిని రామచంద్రం బదిలీఅయ్యారు. ఈ మేరకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంగళవారం రాత్రి ఉత్తర్వులను జారీ చేశారు. వేములవాడ రూరల్ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న సుజాత ఇక్కడకు బదిలీపై రానున్నారు. రామచంద్రం కలెక్టరేట్‌లో సూపరిండెంట్‌గా బదిలీపై వెళ్లారు.

సీపీని కలిసిన వేములవాడ ఏఎస్పీ

కరీంనగర్ క్రైం, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నూతన పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన గౌస్ ఆలంను మంగళవారం వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



సీపీ గౌస్ ఆలంకు పూలమొక్క అందజేస్తున్న వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

సంక్షిప్త సమాచారం

● ఇల్లంతకుంట : మండల కేంద్రంలో జిల్లాస్థాయి టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంటు మంగళవారం ప్రారంభం అయ్యింది. పోటీలకు 48 జట్లు హాజరుకాగా 4 గ్రూపులుగా విభజించారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్యయాదవ్, స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, నాయకులు కూనబోయిన బాలరాజు, ఒగ్గు రమేష్, అన్నాడి నరేందర్‌రెడ్డి, గొడుగు నర్సయ్య, రేగుల కార్తీక్, కనుకయ్య, దత్తు, మహేందర్, హరికృష్ణలతో పాటు నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : బీసీలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కాంగ్రెస్ పార్టీ మాట నిలుపుకుందని మాజీ ఎంపీపీ గుడిసె అయిల్లయాదవ్ పేర్కొన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ మహాసభ జిల్లా అధ్యక్షుడు కూనబోయిన బాలరాజు, మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలతనాగయ్య, నాయకులు కాథ మల్లేశం, ఒగ్గు రమేష్, ముత్యం అమర్, గొడుగు నర్సయ్య, యాస తిరుపతి, గుండ వెంకటేశం, బత్తిని నారాయణ, కిష్టయ్య, కొమురయ్య, సంతోష్, పర్శ అయిలయ్య, సార నారాయణ, వొల్లాల రమేష్, రాములు, కీసరి కనుకయ్య, పర్శరాం, మల్లేశం పాల్గొన్నారు.

● సిరిసిల్ల టౌన్ : సిరిసిల్ల పట్టణం 17వ వార్డు గాంధీనగర్‌లో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి, వార్డు మాజీ కౌన్సిలర్ గుండ్లపెల్లి పూర్ణచందర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజపూర్ణచందర్, వార్డు సభ్యులు గుర్రం నర్సింలు, శ్రీపతి సురేష్, సింగం శరత్, పులి క్రాంతి, బింగి తిరుపతి, మెడికవర్ వైద్యులు, సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : బీసీ రిజర్వేషన్ల పెంపుపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బీసీ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో మంగళవారం బహుజన క్లాస్ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లమ్మల లక్ష్మణ్ మాట్లాడారు. రాష్ట్ర కార్యదర్శి బండారి మల్లేశం, జిల్లాకార్యదర్శి ఇటిక్యాల సుధాకర్, మండల అధ్యక్షులు కాలేరు రాజన్న, కార్యదర్శి దరిపెల్లి రాజేశం, అక్కపెల్లి లక్ష్మీపతి పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండలంలోని జిల్లెల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మంగళవారం విద్యార్థులు బహుమతులను(చీరలను) ప్రదానం చేసి సత్కరించారు. అందజేశారు. పాఠశాల ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న సంతోష్‌ను సన్మానించారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

● చందుర్తి : మండలంలోని మల్యాల జడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు స్వామి వివేకానంద సేవా సమితి సభ్యులు ఎగ్జామ్స్ మెటీరియల్ పాడ్స్, స్కేలు, పెన్నులు మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శరత్‌చంద్ర, వివేకానంద సేవా సమితి సభ్యులు పత్తిపాక శ్రీనివాస్, కొడకంటి గంగాధర్, లోకోజు సతీష్, దుర్శెట్టి రాజు, పంచెర్పుల దివ్య సాగర్, పాటి సుధాకర్, గొల్లపెల్లి సాయికృష్ణ, మూడపల్లి ముఖేష్, మోతుకుపెల్లి మధు, పత్తిపాక మల్లయ్య, గుర్రం నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలోని కేసీఆర్ కాలనీకి చెందిన కడమంచి సాయవ్వ(67) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతిచెందింది. అంత్యక్రియలు నిర్వహించేందుకు చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలోని సిబ్బంది ముందుకు వచ్చారు. గిద్దెచెరువు ప్రాంతంలో గ్రామానికి చెందిన యువకుడు ప్రవీణ్‌రెడ్డి మానవత్వంతో ముందుకు వచ్చి తన జేసీబీ వాహనంతో కందకం తీసి సాయవ్వ మృతదేహాన్ని ఖననం చేశారు.

● గంభీరావుపేట: గంభీరావుపేటలో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు పాపగారి అక్షయ్‌నారాయణను మంగళవారం తెల్లవారు జామున పోలీస్‌లు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విద్యార్థి సంఘాలు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన క్రమంలో పోలీస్‌లు బీఆర్ఎస్‌వీ నేతలను ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. కొద్దిసేపు అయ్యాక బీఆర్ఎస్‌వీ నాయకులను తరువాత వదిలిపెట్టారు.

● వేములవాడ రూరల్ : హన్మాజీపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు మంగళవారం వివిధ రాష్ట్రాల సంప్రదాయ వేషధారణలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చిట్నేని శ్రీకాంత్ రావు, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జంకె మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండలంలోని మరిగడ్డలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన పెరటి కోళ్ల పెంపకాన్ని మంగళవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి పరిశీలించారు. గ్రామంలో నిర్మిస్తున్న పశువుల పాకను, ఫీడర్ ఛానల్ పనులను పరిశీలించారు. ఏపీవో రాజయ్య, ఈసీ అశ్విని, పంచాయతీ కార్యదర్శి కవిత, టిఏ గంగజల, నాగరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ రమాదేవి ఉన్నారు.

● ఇల్లంతకుంట : తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నామని తిప్పాపూర్ గ్రామపంచాయితీ పరిధిలోని దమ్మనిపల్లె గ్రామస్తులు పేర్కొన్నారు. తాగునీరు సరఫరా కాకపోవడంతో కొనుగోలు చేసి ట్యాంకర్ల ద్వారి ఇంటికి తెచ్చుకుంటున్నామన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి ఇబ్బంది తీర్చాలని కోరారు.

బీసీ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : బీసీ బిల్లులకు చట్టబద్ధత కల్పించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు అన్ని రాజకీయ పార్టీలు కృషి చేయాలని బీసీ సాధికారిత సంఘం జిల్లా అధ్యక్షుడు గాజుల బాలయ్య అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం సంఘం కార్యాలయంలో బాలయ్య మాట్లాడారు. శాసనసభలో ప్రభుత్వం బీసీ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. బీసీ బిల్లులను పార్లమెంటులో కూడా ఆమోదం పెందేలా కృషి చేయాలని చట్టబద్ధమైన బీసీ రిజర్వేషన్లు కల్పించేలాగా పార్టీలు ఐక్యంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సాధికారిత జిల్లా ప్రధాన కార్యదర్శి తీగల శేఖర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు గుజ్జె శివరాం, జిల్లా ఉపాధ్యక్షుడు చింతకుంట వెంకటేశం, యూత్ జిల్లా అధ్యక్షుడు అంకారపు మహేష్, మహిళ జిల్లా అధ్యక్షురాలు గుజ్జె తార, యూత్ పట్టణ అధ్యక్షుడు అన్నారపు వేణుగోపాల్, మహిళ పట్టణ అధ్యక్షురాలు వంకాయల కావ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కోత్వాల్ ప్రమీల నాయకులు పాల్గొన్నారు.

బీసీల బిల్లును ఆమోదించి ఆత్మగౌరవాన్ని కాపాడారు

- జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ

సిరిసిల్ల టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసన సభలో ప్రవేశపెట్టి ఆమోదింప జేసి బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడారని జిల్లా గ్రంథాలయం చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి, మంత్రులకు ధన్యవాదలు తెలుపుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. స్వీట్లను పంపిణి చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ సత్యనారాయణ, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడారు. బీసీ బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించి బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్మురు స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, కుడికాల రవికుమార్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్‌చైర్మన్ నీలి రవీందర్, మాజీ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, గోలి వెంకటరమణ, గుండ్లపెల్లి గౌతమ్, నక్క నర్సయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదంపై సంబరాలు



సిరిసిల్లలో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు



వేములవాడలో..



చందుర్తిలో..

సిరిసిల్ల టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ శాసన సభలో బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తాలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టపాసులు కాల్చి స్వీట్లను పంపిణి చేసి సంబరాలు జరుపుకున్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్షహన్మాండ్లు, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడక కమలాకర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్ప దేవయ్య, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము, పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, యాదవ సంఘం అధ్యక్షుడు జగ్గాని మల్లేశంయాదవ్, నాయీబ్రాహ్మణ సంఘం నాయకుడు సమ్మెట రవి, విశ్వబ్రాహ్మణ సంఘం ఇల్లంతకుంట అధ్యక్షుడు తిరుపతి, నాయకులు పంబాల దేవరాజు, తోట్ల రాములు, బోయిన శ్రీనివాస్, బచ్చు ప్రసాద్, కొండ విజయ్, సామల తిరుపతి, సత్యనారాయణ, అంజనేయులు, శ్రీధర్, శేఖర్, మల్లేశం, గౌతం, రాజు పాల్గొన్నారు.

● గంభీరావుపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ అంజిరెడ్డి, డైరెక్టర్లు రాజనర్సు, ప్రభాకర్, సోషల్ మీడియా ఇంచార్జీ గౌరీశంకర్, నాయకులు ప్రసాద్‌రావు, పిట్ట వెంకటి, పర్శరాములు, లక్ష్మీనారాయణ గౌడ్, రాజులు, అక్కపల్లి బాలయ్య, రాజిరెడ్డి, రాజశేఖర్, మహేష్, మల్లయ్య, కుమార్, లచ్చయ్య, నాంపెల్లి, బాబు ఉన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, గౌస్, రాంరెడ్డి, బాబు, శ్రీనివాస్ రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాజేందర్, శ్రీకాంత్‌రెడ్డి, బాలయ్య, తిరుపతిరెడ్డి, బుచ్చాగౌడ్,దేవయ్య, శ్రీనివాస్, ఇమాం, రాజునాయక్, బాల్‌రెడ్డి, గోపాల్, రాజుకుమార్ ఉన్నారు.

● ముస్తాబాద్ : మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్, ఏఎంసీ చైర్మన్ తలారి నర్సింలు, వైస్ చైర్మన్ రాంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొండం రాజిరెడ్డి, ప్రతాపరెడ్డి, కొమురయ్య, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, శీల ప్రశాంత్, మిరుదొడ్డి భాను, గోవర్ధన్‌నాయక్, ఉచ్చిడి బాల్‌రెడ్డి గొండయ్య, రాజలింగం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని ఇందిరాచౌక్ చౌరస్తాలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తూమ్ జలపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, ఎర్రం గంగ నర్సయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, కేసిరెడ్డి నర్సారెడ్డి, పల్లి గంగాధర్, తర్రె లింగం పాల్గొన్నారు.

● వేములవాడ : వేములవాడ పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కనికరపు రాకేశ్, సాగరం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, బింగి మహేష్, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్, పుల్కం రాజు, నాగుల రాము, వస్తాద్ కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ అర్బన్ మండలంలోని నందికమాన్ వద్ద సీఎం, మంత్రులు, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించి టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ అర్బన్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రం రాజు, ప్రధానకార్యదర్శి శ్రీనివాసరావు, కత్తి కనకయ్య, గాలిపెల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : నూలకమర్రి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ ఆధ్వర్యంలో టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మెన్ రొండి రాజు, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు సోయినేని కరుణాకర్, పిట్టల వెంకటేశం, వంగపల్లి మల్లేశం, పాలకుర్తి పర్శరాం, రోమాల ప్రవీణ్, నేదూరి రమేష్, జాగిరి సురేష్, రాధాకృష్ణ, గుడిసె శంకర్, సల్ల సురేష్, రాజు, రోమాల బక్కయ్య, పర్శరాం పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నరసింహాచారి, బుర్ర రవీందర్, వెంగలి వెంకన్న, లింగయ్య, సాసాల రాజిరెడ్డి, సదానందం పాల్గొన్నారు.

● చందుర్తి : మండలకేంద్రంలో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, ఈసరి శ్రీనివాస్, శంకర్, మర్రి కృష్ణ, సత్యం, ప్రభాకర్, చంద్రం, శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, దాసు, లక్ష్మణ్, రవి, అజయ్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ

వేములవాడ టౌన్, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ వేములవాడ మండల కమిటీని అధ్యక్షుడు బుర్ర శేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం నియామించారు. వేములవాడ మండలం నందికమాన్ వద్ద ఏర్పాటుచేసిన సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శులుగా చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్‌లు, ఉపాధ్యాక్షులుగా బీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జింక శ్రీనివాస్, తిప్పవరవేని రాజు, ఎరుగొక్కుల రమేష్‌లు, కార్యదర్శులుగా శ్రీనివాస్, సంజీవ్‌రెడ్డి, మధు, శేఖర్‌లు అధికార ప్రతినిధులుగా పవన్, విశ్వనాధం శ్రీధర్‌లు కోశాధికారిగా సోలంకి అరవింద్ కార్యవర్గ సభ్యులుగా బొల్లు తిరుపతి, అజయ్, ప్రశాంత్ రవి, నాగరాజు నియమించగా మహిళమోర్చా అధ్యక్షురాలిగా ముదం శిరీష, కిసాన్ మోర్చా అధ్యక్షుడగా భాస్కర్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా కొమ్మనబోయిన సంతోష్‌యాదవ్, దళిత మోర్చా అధ్యక్షుడిగా గంట మహేష్, యువ మోర్చా అధ్యక్షుడిగా అరవింద్, సోషల్ మీడియా కన్వీనర్‌గా మధురావులను నియమించినట్లు బుర్ర శేఖర్ గౌడ్ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇల్లంతకుంట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలుగా వేతనాలు రాక ఫీల్డ్‌అసిస్టెంట్లు ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటు ఎంపీడీఓ శశికళకు మంగళవారం వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు 20సంవత్సరాలుగా పనిచేస్తున్న తమను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ మండలశాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద రాజులతో పాటు వివిధ గ్రామాల ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

తంగళ్లపల్లి, మార్చి 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీఆర్ఎస్వీ అసెంబ్లీ ముట్టడికి పిలుపు నివ్వడంతో తంగళ్ళపల్లి మండలానికి చెందిన నాయకులు అసెంబ్లీ ముట్టడికి బయలుదేరడాన్ని పోలీసుల అడ్డుకున్నారు. హైదరాబాద్ బయలుదేరిన బీఆర్ఎస్వీ నాయకులను తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కి తరలించారు. అరెస్ట్ అయినవారిలో బీఆర్ఎస్వీ నాయకులు చీమల ప్రశాంత్ యాదవ్, బొలవేని ఎల్లం యాదవ్, పొన్నాల చక్రపాణి, సయ్యద్ ఆఫ్రోజ్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

నిధులు మంజూరు

కోనరావుపేట, మార్చి 18 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఈజీఎస్ నిధుల ద్వారా 14లక్షలు మంజూరైనట్లు కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, మండల అధ్యక్షుడు ఫిరోజ్‌పాషా తెలిపారు. కోనరావుపేటలో విలేకరులతో మాట్లాడుతూ పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ నిర్మాణానికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. నిధుల మంజూరికి కృషి చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.